# రోరింగ్ ప్రాక్టీస్

...పంచుకోవడం అంటే ఇదేటయ్యా? — ...మ్మపోతోందంటూ లేచిపోవడమా? అమ్మగారికి వడుం నొప్పికీ, మీ ఆవిడకు పంటినొప్పికీ మందిస్తాను, తీసుకు వెళ్ళు!" అంటూ చందూకాయ పెట్టెలోంచి రెండు పొట్లాలు తీసి అతని చేతిలో పెడతాడు. అవి తీసుకుని, సుబ్బారావు లేచి వెళ్ళబోయేటంతలో, మళ్ళీ అతన్ని ఆపి "పొట్లాలంటే తీసుకున్నావ్? బావుంది. కానీ వాటిని ఎట్లా, ఏ అనుపానాలలో వేసుకోవాలో అడగవేం?" అని ఆ వివరాలన్నీ చెప్పి, చివరగా ముక్తాయింపుగా, "కిందటిసారీ మందుకు డబ్బులియ్యలేదు, ఇప్పుడన్నా ఇస్తావా, ఇదీ అరువు బరువేనా?" అంటాడు నిష్కర్షంగా.

అంతమందిలో అంతమాట భట్టుమూర్తి అనడంతో సుబ్బారావుకు ప్రాణం చచ్చిపోతుంది "లేదండి! ఇదిగో డబ్బులు!" అంటూ అయిదో పదో చేతిలో పెడతాడు. తలవొంచుకుని గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోతాడు. ఇట్లా సుబ్బారావే కాదు, సుబ్బారావు, వెంకటరావు, సింహాచలం, శ్రీరామ్మూర్తి, చలపతిరావు, ఎవరైనా సరే, ఆ వీధిలో ఆ దారంట నడవడం తరవాయి, అతన్ని భట్టుమూర్తి వాడుపుగా పట్టేస్తాడు.

మందులు ఇవ్వడం కుదరకపోతే, మనిషినికట్టి ఎడసే కబుర్లు చెబుతాడు. ఆ కబుర్లలో రాజకీయాలమీద విసుర్లుంటాయి, సాహిత్య విమర్శలుంటాయి. కళా సంబంధంగా అభిప్రాయ ప్రకటనలుంటాయి ఏ తిండి తింటే ఏ జబ్బులు వస్తాయో తెలియజెప్పడం వుంటుంది. కుటుంబ నియంత్రణ విధానాలమీద లెక్చర్లుంటాయి. అమెరికా అధ్యక్షుడి దగ్గర్నుంచి ఆంధ్రా లాటరీ వరకూ, అన్నివిషయాల మీదా ఉపన్యాసాలుంటాయి.

డాక్టరుగారిచ్చే మందుల్ని చూసీ, ఆయన అందించే ఉపన్యాసాల్ని చూసీ భయపడనివాడు మా టౌన్లో హోల్ మొత్తంమీద కనబడడు. మొదటిసారి విని తల వూపినవాడు, రెండోసారికి తల పట్టుకుంటాడు. మూడోసారికి కళ్ళు తేలేస్తాడు. నాలుగోసారికి ఆ చుట్టుపక్కలకు రాకుండా పారిపోతాడు. ఆ తర్వాత కబురంపినా కనబడడు.

నేనూ అంతే. నలుగుర్లో ఒకణ్ణి. ఆయన మందులన్నా, ఆయన మాటలన్నా నాకు తగని భయం. ఆయన మందులు వున్న రోగాల్ని పోగొట్టడం మాట అటుంచి, లేని సమస్యల్ని, కొత్త బెదదల్ని సృష్టిస్తాయి. ఆయన మాటలు సంఘం మీద విరక్తినీ, ద్వేషాన్నీ కల్గించి, వున్న కాస్త ఆశనూ, ఉత్సాహాన్నీ ఆర్పేస్తాయి. ఆయనకే అంతా తెలుసనీ, మనకసలేం తెలీదనీ అన్పింపజేసి, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌కు మనను గురిచేస్తాయి. ఎందుకీ బెడద? ఆయన మందు వేసుకోకపోతే ఏం? ఆయనకు శ్రోతగా వుండకపోతే ఏం?

ఆ రోజు ఉదయం ఆ దారిగుండా వెళ్ళక తప్పలేదు. మా మామగారు వస్తున్నట్లుగా ఉత్తరం వచ్చింది. ఆయన వంటరిగా ఎప్పుడూ రారు, సకుటుంబంగా వస్తారు. మా ఆవిడ ఆయన పెద్ద కూతురు. ఆవిడంటే మా మావగారికీ మా అత్తగారికీ, మా ఆవిడ ఆరుగురి చెల్లెళ్ళకూ, ఒక్కగానొక్క తమ్ముడికీ ఎంతో ఇష్టం. అందుకని మా మామగారు వచ్చేటప్పుడు ఆయన వాళ్ళందర్నీ వెంట బెట్టుకునే వస్తారు.

"ఏమండీ! ఇంట్లో కూరగాయలు నిండుకున్నాయ్?" అన్నది మా ఆవిడ కొంపలంటుకుపోయినంత ఆందోళనను గొంతులో ధ్వనింపజేస్తూ. కూరలయిపోతే, ఉత్త పప్పు చేయొచ్చు. పచ్చళ్ళు వేసి పెట్టవచ్చు. వడియాలూ, అప్పడాలూ వడ్డించవచ్చు. ఏమైనా చెయ్యవచ్చు. ఉహూ, అదేం కుదరదు. వాళ్ళవాళ్ళు వచ్చేసరికి అంతా రంగ రంగ వైభోగంగ వుండాలి, అదీ సంగతి. ఈ జీవుడు, బక్కచిక్కిన, బ్రతకలేని బడిపంతులు వున్నాడు కదా, వీణ్ణి బజారుకు తరిమి, మార్కెట్టు అంతా కొనిపిస్తేగాని ఆవిడకు గౌరవంగా వుండదు, నిద్ర పట్టదు, తన కన్నవాళ్ళముందు తలెత్తుకోడానికి వీలుండదు. అందచేత సంచీ తీసుకుని బయటపడ్డాను.

"ఇదిగో సందులూ, గొందులూ, అడ్డదారులూ, పార్కులూ, కాల్వకట్టలూ అంటూ కాలం వెళ్ళబుచ్చేరు. చక్కని రాజమార్గం వుంది కదా, ఆ దారంటే వెళ్ళి వెళ్ళినట్టే వచ్చేసేండి." అంటూ మా ఆవిడ లోపల్నుండి ముదలకించింది.

"అలాగేలేవే — రోడ్డుమీదకు కూడా వచ్చి నాకు పరాకులు పలకాలేవిటి?" అందుకని ఆవిడ మాట ప్రకారం ఆ దారిగుండా వెళ్ళేను. ఇరుక్కుపోయాను. ఉదయ సూర్యుడు ఆకాశంలో ఓ బారెడు దూరం పైకొచ్చేశాడు. ఎండ కరకరమంటూ నీడల్ని మింగేస్తోంది. రోడ్డుమీద రకరకాల ధ్వనులు — నిద్రపోతున్న రోడ్డు లేచి ఆవలిస్తున్నట్టుగా వుంది. నేను గబగబా అడుగులు వేస్తున్నాను. వేణుగోపాలస్వామి మందిరం దాటాను. అదిగో జువ్విచెట్టు అమ్మయ్య! అదీ దాటాను. కోనేరు దాటుతున్నాను. కోనేట్లో పూలు ఎంత అందంగా మెరుస్తున్నాయో! అమ్మవారి కంటి వెలుగుల్లా వున్నాయ్! కోనేట్లో నీళ్ళు తళతళలాడుతున్నాయ్. అయ్యగారి పెదవిమీద పూచిన చిరునవ్వుల్లా వున్నాయ్. వాటిని చూస్తూ నడుస్తున్నాను.

టింగ్...టింగ్... టింగ్...టింగ్... సైకిలు బెల్లు మోగుతోంది.

పాయ్, పాప్పాయ్.. పా...య్! లారీ హారను దగ్గరగా అరుస్తోంది.

వెస్పా స్కూటరొకటి కీచుమంటూ గొడవ పెడుతోంది.

ఏమైంది?... ఏమైంది నాకు?.. ఏదో అయింది. ఏదో వచ్చి ఢీ కొడుతోంది. అబ్బా!... అమ్మా! కళ్ళు మూతలు పడుతున్నాయి, కాళ్ళు తేలిపోతున్నాయ్. గుండె ఆగిపోతున్నట్టుంది. ఒంట్లో చురుక్కుమంటున్న మంట, తలంతా దిమ్ము. తెలివి కొచ్చేసరికి ఎదురుగా డాక్టరు భట్టుమూర్తి కనిపించాడు — చేతులు తువ్వాలుతో తుడుచుకుంటూ.

"ఏం భయం లేదు — మన లోకంలోకి వచ్చేశాడుగా?" అంటున్నాడు పక్కనున్నవాళ్ళతో

మెల్లమెల్లగా అర్థం అవుతోంది నాకు యాక్సిడెంట్ అయిందని. నన్ను నలుగురూ సాయం పట్టి డాక్టరు భట్టుమూర్తి దగ్గరకు చేర్చారు. ఆయన ట్రీట్‌మెంట్‌తో, స్పృహ కోల్పోయిన నేను మళ్ళీ స్పృహలోకి రాగలిగాను!

"ఏమండీ శాస్త్రిగారూ, ఎట్లావుంది?" ఆయన నా మీదకు వంగి అడుగుతున్నాడు.

"మా ఇంటికి కబురు చెయ్యండి!" బలహీనంగా అన్నాను. "నొప్పులండీ! అబ్బా!"

'అట్లాగే! ముందీ మాత్రవేసుకోండి!"

కాంపోజ్ ఇచ్చినట్టున్నాడు. నొప్పులు తెలీకుండా మగతలోకి జారిపోయాను. అట్లా ఎంతసేపున్నానో నాకు తెలీదు. ఏదో మత్తుగా, గమ్మత్తుగా మాత్రం వుంది. కళ్ళు తెరిచేసరికి కిటికీలోనుండి చంద్ర కిరణం ఒకటివచ్చి నా మంచంమీదపడి నన్ను మెల్లగా సేద తీరుస్తున్నది. గోడమీద వున్న బల్లి ఒకటి క్షణంసేపు ఆగి నాకేసి చూసి, తలాడిస్తూ ముందుకు పరుగెత్తింది. చిరుగాలి కెరటం వచ్చి ముంగురులను సవరిస్తూ ధైర్యం చెబుతున్నది. దూరంగా భట్టుమూర్తీ, ఆయన భార్యా. భట్టుమూర్తికి నేను మెలకువలోకి వచ్చిన సంగతి ఇంకా తెలీదులాగావుంది. నా గురించిన చింత లేకుండా తన భార్యతో మాట్లాడేస్తున్నాడు. ఆమె పెద్ద ముత్తయిదువ. పెద్ద బొట్టుపెట్టుకుంది వెలిసిపోయిన చీర కట్టుకుంది. మొహం అంతా పచ్చగా వుంది. ఆమె కళ్ళు జగ్రదహస్య సిద్ధాంతం తెలిపిన దానిలా మెరుస్తున్నాయి. ఆమె భట్టుమూర్తికి కాళ్ళు పడుతోంది.

"అయితే ఈ పూటకు బియ్యం సరిపోయినట్యుంటావ్?"

"పొద్దున్న ఆ కాసిని డబ్బుల్లో బియ్యం, పప్పు, ఉప్పు కొన్నాను!"

"ఇంకా నయం, మేడలూ, మిద్దెలూ కూడా ఆ అయిదు రూపాయల్తోనే కొన్నానన్నావు కాదు" డాక్టరు భట్టుమూర్తి నవ్వాడు. "మనకు తగిలిందే ఒక్క పేషెంటు. వాడిచ్చిందే అయిదురూపాయలు. ఆ అయిదురూపాయలతో బియ్యమే కొన్నావా, పప్పులే కొన్నావా, పంచభక్ష్య పరమాన్నమే చేసి పెట్టావా? నాకు తెలీదనుకోకు రాజ్యం!"

ఆయన వున్నట్టుండి ఆవిడ గడ్డం పట్టుకుని

## ఎలక్ట్రానిక్ నిఘంటువు

జపానులోని షార్ప్ ఎలక్ట్రానిక్ కార్పొరేషన వారు క్రొత్త ఎలక్ట్రానిక్ నిఘంటువును తయారుచేశారు. ఇందులో చిన్నరకం నిఘంటువులో 6,700 మాటలు, పెద్దరకం నిఘంటువులో పది వేల మాటలు పొందుపరచబడి వుంటాయి. బటన్ నొక్కితే ఇంగ్లీషు పదానికి తగిన జపనీస్ పదం, లేక జపనీస్ పదానికి తగిన ఇంగ్లీషు పదం లభిస్తుంది. అంటే యిది రెండు రకాల నిఘంటువుగా వుపయోగపడుతుంది. అంతేగాక దీనిని చిన్నరకం కేలిక్యులేటరుగా కూడా వుపయోగించుకోవచ్చు.

మొహం ఎత్తి, కళ్ళల్లోకి చూశాడు. ఆ కళ్ళు వెన్నెట్లో తడిపొడిగా మెరుస్తున్నాయి. "పిల్లలకు అన్నం పెట్టి వుంటావ్ – నాకు తెలుసు. నువ్వు తిన్నావా ?"

"మీకంటే సోమవారాలూ, గురువారాలూ అంటూ వున్నాయ్, నాకేం వున్నాయ్ ? సక్షణంగా తింటున్నాను, రెండు పూటలా, కడుపునిండా !" ఆవిడ గొంతు వణికింది. ఆయన తన కాళ్ళమీద నుండి ఆవిడ చేతులు తీసేశాడు.

"వస్తాయ్ రాజ్యం ! ఆ రోజులూ వస్తాయ్, సోమవారాలూ, గురువారాలూ అంటూ ఏకభుక్తం చేయవలసిన అవసరం నాకు వుండదు. నువ్వన్నట్టే రెండు పూటలా, కడుపునిండా నువ్వు తినగలవ్ !" భట్టుమూర్తి కంఠం బరువుగా ధ్వనించింది. నేను రెండు పూటలా తినడంలేదని కాదండీ నా బాధ ! మేం తినడం కోసమని వారానికి రెండు రోజులు మీరు అన్నం మానేస్తున్నారే అని ! లేమికి మతం పేరు పూసి —"

"రాజ్యం ! ఈ రాత్రిని చూడు, వెన్నెల ఎంత చల్లగా వుందో, ఎంత హాయిగా గాలి వీస్తోందో, ఆకాశంలో ఆ నక్షత్రాలు ఎంత బాగా మెరుస్తున్నాయో, ఇప్పుడెందుకా మాటలు ? సిరిదా వచ్చిన వచ్చును, సలలిత నారికేళ సలిలము భంగిన్ ! మనకూ మంచిరోజు లొస్తాయ్ ! మన పిల్లలూ కడుపునిండా అన్నం తింటారు, నచ్చిన గుడ్డ కట్టుకుంటారు. ఒక్క సంగతి చెబుతాను విను మనకన్నా దౌర్భాగ్య స్థితిలో ఎంతమంది లేరు ఈ దేశంలో ? ఉన్నవాళ్ళను చూసి ఈర్ష్య పడకుండా లేనివాళ్ళను చూసి, వాళ్ళకన్నా పై మెట్టుమీద నువ్వున్నందుకు ఆ భగవంతుడికి కృతజ్ఞతలందించు ఏదీ ఓ అష్టపది అందుకో !"

ఆమె క్షణంసేపు మౌనంగా వుండిపోయింది. ఆ తర్వాత ఆ రాత్రివేళ, వెన్నెల వర్షంలో తడుస్తూ ఓ అష్టపదిని మెల్లగా పాడడం మొదలెట్టింది. ఆమె గొంతులో చెప్పుకోదగిన మాధుర్యం లేదు, కానీ చెప్పలేని గాంభీర్యం వుంది. ఆ గాంభీర్య ప్రవాహంలో పడి నేను మళ్ళీ నిద్రపోయాను.

మర్నాడు ఎప్పుడు కళ్ళు తెరిచానో నాకు తెలీదు. కళ్ళు తెరిచేసరికి ఎదురుగా కావలసిన వాళ్ళంతా కనిపించారు. మా ఆవిడ నామీదకు వంగి ఆత్రంగా చూస్తోంది. అత్తమామలూ, మరదళ్ళు, బావమరదీ మంచం చుట్టూతా నిలబడ్డారు.

## రోరింగ్ ప్రాక్టీస్

"నా మంగళసూత్రం గట్టిది కాబట్టి మీరు బ్రతికిపొయ్యారు. పాపిష్టి వెధవలు – ఎవరండీ మిమ్మల్నొచ్చి గుద్దుకొన్నదీ – ఇంతకీ కూరలు కొన్నతర్వాత దెబ్బలు తగిలాయా ?... కూరలు కొనకముందేనా ?" మా ఆవిడకు నేను సమాధానం చెప్పలేదు.

"ఏం నాయనా, ఏ వెహికిల్ నిన్ను గుద్దుకొన్నదో ఆ వెహికిల్ నంబరు చూశావా, దానిమీద కేసు ఫైల్ వేద్దాం !" అన్నారు మావగారు; ఆ మన ప్లీడరుగుమాస్తా

"కూరలూ, కేసులూ తర్వాత, ముందు కాస్త కాఫీ కావాలి !" అన్నాన్నేను నీరసంగా.

"ఇదిగో నాయనా !" భట్టుమూర్తిగారి భార్య కాఫీ కప్పుతో దగ్గరకు వచ్చింది.

"మీరా ?"

"తీసుకోవయ్యా పంతులూ ! ఎంతమందికి మా శ్రీమతి తన చేతుల్తో ప్రతిరోజూ ఇట్లా కాఫీ ఇస్తుందో నీకేం తెలుసు ? ప్రక్కన నిస్త్రి లేకుండా వొంటిపిల్లి రాకాసిలా భోంచేయడం మా ఇంటావంటా లేదు ఈ రోరింగ్ ప్రాక్టీస్‌తో ఇప్పుడంటే నాకు సరిగా భోంచేయడానికి కూడా వీల్లేకపోతోంది కానీ, లేకపోతే మా ఇల్లో దివాణం కాదూ ?"

"రాత్రి నేను చూసిన భట్టుమూర్తికీ, ఈయనకూ ఎంత భేదం ? ఆ మాటలకూ ఈ మాటలకూ ఎంత వ్యత్యాసం ? నాకు ఈ కప్పు కాఫీ ఇవ్వడంలో, వాళ్ళ పిల్లల్లో ఎవరికో ఒకరికి కాఫీ లేకుండాపోతుంది. ఆ సంగతి నాకు తెలుసని ఆయనకు తెలీదు. కానీ ఇప్పుడు నేను ఆ కాఫీ తాగకుండా వుంటే, ఆయన అనుమానిస్తాడు నిజం తెలిసిపోయిందేమోనన్న అనుమానంతో బాధ పడతాడు. ఆయనను బాధపెట్టే హక్కు నాకెక్కడిదీ ?

"థ్యాంక్సండీ !" ఆ కాఫీకప్పును నవ్వుతూ అందుకున్నాను. నేను తాగడం చూసి ఆయన సంతృప్తితో అంటున్నాడు – "నా దగ్గరకొచ్చిన ప్రతి పేషెంటుకూ కాఫీ ఇస్తాను, భోజనం పెడతాను ఎంతమంది నా ఇంట్లో కాఫీలు తాగారో నాకు లెక్కలేదు. ఎంతమంది ఎంగిలిపడ్డారో జ్ఞాపకమే లేదు. కడుపుకు అన్నం పెట్టి, వొంటికి మందు వేసి, మనసుకు సంతోషం కల్గించడమే నా ధ్యేయం !"

మా అత్తగారు అప్పుడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అన్నది. "ఓహోహో ! ఏం గొప్ప గుణం ! ఎంత మంచి మనసు ?! ఈ కాలంలో ఇటువంటి డాక్టర్లుండడమే అరుదు సుమా ! మా అల్లుడు గారు, మీ వంటివారి చేతుల్లో పడడం ఆయన అదృష్టం !!"

"ఏమండీ బావగారూ, లేచివస్తారేమిటి ? వెళ్ళిపోదాం !" మా బావమరిది అడుగుతున్నాడు

"అమ్మమ్మ ! అప్పుడే వద్దు. రేపొద్దుటిదాకా వుండనీండి ! వేసిన పట్టీలు వదులు కాకూడదు. ఇక్కణ్నుంచి కదిలితే ఇచ్చిన అరుకు పనిచేయదు !" భట్టుమూర్తి అభ్యంతరం తెలిపాడు.

"అట్లా అయితే ఇక్కడే వుండనీండి !" మా ఆవిడ అన్నది.

"బడికెళ్ళొద్దూ ?" అన్నాను నేను బెంగగా


"బడీ లేదు, బండలూ లేదు. సెలవుచీటీ పంపించేసి, హాయిగా రెస్టు పుచ్చుకోండి రెండ్రోజులు !" మా ఆవిడ తన నిర్ణయం ప్రకటించేసింది.


"మీరొచ్చింతర్వాతే వెళ్ళతాంలే బాబూ ! తొందరేం లేదు !" మా అత్తగారన్నది.

అందరూ వెళ్ళడానికి బయల్దేరారు. డాక్టరు గారు వాళ్ళతో రెండడుగులు వేసి, "ఏమండీ ! కావర్స్ ఏవన్నా వున్నాయా ?" అంటూ మా మామగార్ని అడిగాడు. మా మామగారికి అర్థం కాలేదు. "అంటే ?" అన్నాడు నొసలు చిట్లించి.

"బిల్లు తర్వాత ఇస్తాను. ముందు కొంత అడ్వాన్సుగా... !"

"మా అల్లుడుగార్ని లేచి తిరగనీండి, ఆయనే ఇస్తాడు. అయినా మీరు వాళ్ళ ఇంటి డాక్టరట గదా ! మీక్కూడా అంత తొందరైతే ఎట్లాగండీ? అయినా మీరు చేసేది అల్లోపతి వైద్యమా ఏమన్నానా ? – నాటువైద్యమేగా ! ఆకులూ, వేళ్ళూ నూరతారు. కాసిని పొడర్లు నీళ్ళలో కలుపుతారు. తగ్గితే మీ మహిమ అంటారు. తగ్గకపోతే మా ఖర్మ అంటారు. అయినా డాక్టరూ! మీరు చేసేది ఏం వైద్యమో స్పష్టంగా చెప్పండి. అల్లోపతీనా ? హోమియోపతీనా? ఆయుర్వేదమా? అన్నీ కలిసిన లకోటా వైద్యమా? ఏమిటో చెప్పండి మాకు ! అసలు మా అల్లుడుగారి లాంటివాళ్ళు మీ



దగ్గర వైద్యం చేయించుకోవడమే మీకు గొప్ప. ఇహ డబ్బు అంటారా ? వాళ్ళకు ఇవ్వకా తప్పదు, మీకు పుచ్చుకోకా తప్పదు. కొంచెం ముందూ వెనకా, అంతే !''

ఆయన తన భార్యనూ, కూతుళ్ళనూ, కొడుకునూ వెంటబెట్టుకొని వెళ్ళిపోయాడు డాక్టరుగారికి మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా.

మా మామగారి మాటలు విని భట్టుమూర్తి గారి మొహం నల్లగా మాడిపోయింది తనే తప్పు చేసినట్టు తలవంచుకుని నా వైపైనా చూడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయాడు. నేనే పిలిచాను ''భట్టు మూర్తిగారూ !''

ఆయన తలఎత్తాడు. ఏవిటన్నట్టుగావున్నాయి ఆయన చూపులు.

''ఎంత కావాలి మీకు ?''

ఆయన నవ్వాడు. ఎంతియ్యగలవయ్యా నువ్వు? ఆర్చేవాడివా, తీర్చేవాడివా అన్నట్టున్న నవ్వు అది

''ఓ లక్ష కావాలి !''

''లక్ష రూపాయలా ?!'' ఆశ్చర్యపోయాను.

''లేకపోతే ఎంత కావాలేమిటి పంతులుగారూ ! మీకు తోచినంత మీరిస్తారు. నాకు అదృష్టము న్నంత నాకు వస్తుంది. నా వృత్తికి, ఫిక్స్డ్ రూల్స్ అంటూ ఏమున్నాయి ? మా తాతగారు ఆయుర్వేదంలో భిషగ్గిత్ను. అపరధన్వంతరీ అవతారం. చచ్చిపోయేవాడికి ఆవకాయా, గోంగూరా పెట్టి మందిచ్చి బ్రతికించి పంపేవాడు ఇంటికి! లంకంత ఇల్లు కట్టాడు. యాభై ఎకరాల మాగాణీ సంపాయించాడు మా నాన్నగారు హోమియోపతీలో ఈ ఆరేడు జిల్లాల్లో అందెవేసిన చేయి అయితే ఏం ? యాభై ఎకరాలూ హారతి కర్పూరం అయి పోయాయి. ఇహ నేను మిగిలాను. ఏ వైద్యం కావాలంటే ఆ వైద్యం చేస్తాను. సంధిలో వున్న వాడ్ని బతికిస్తాను. క్షణం తీరికలేదు. ఇసకేస్తే రాలనంతమంది పేషెంట్లు. సంపాదనంటారా, ఆ దేవుడిచ్చినంత !!''

భట్టుమూర్తి అట్లా మాట్లాడుతుండగానే, కొద్ది నిమిషాల క్రితం తండ్రితో కలసి బయటకి వెళ్ళిపోయిన నా భార్య ఆపసోపాలు పడుతూ వెనక్కు తిరిగివచ్చి ''ఏమండీ ! కూరలు కొనకుండానే జరిగి పోయింది కదూ ఈ యాక్సిడెంటు ! ఆ కూరల డబ్బులేమైనయ్ మరీ ?'' అనడిగింది.

''ఎక్కడో పడిపోయి వుంటాయ్!'' నింపాదిగా అన్నాను.

''అయ్యో! అయ్యో! పదిరూపాయలిచ్చి పంపించాను మనిషికి ! ఎంత యాక్సిడెంటు అయితే మటుకు, డబ్బులు పడిపోతే చూసుకోవద్దుటండీ— ఆ పదిరూపాయలూ మీ దగ్గరున్నాయేమో, వెళ్తూ వెళ్తూ కూరలన్నా కొనుక్కు వెళ్లొచ్చు అనుకుని, అమ్మనూ నాన్ననూ వీధిలో నిలబెట్టి మళ్ళీ వెనక్కు తిరిగొచ్చాను, పిచ్చిమొహం వాన్ని !''

నా వేపు తిరస్కారమూ, జాలీ కలిసిన చూపు చూసి వెళ్ళిపోయింది

ఆమె నాతో మాట్లాడుతూ వుండగానే, డాక్టరు భట్టుమూర్తి వరండామీదకు వెళ్ళిపోయాడు.



# రోరింగ్ ప్రాక్టీస్

ఒక్కక్షణం నిశ్శబ్దం. అంతలో ఎవరో రావడం, వాళ్ళతో ఆయన పిచ్చాపాటీ కబుర్లు వాళ్ళు వెళ్ళి పోయారు. మళ్ళీ నిశ్శబ్దం. లోపల్నుంచి ఆయన భార్య రాజ్యం రాబోతుంది బయటకు. ఆవిడ గడప ఇవతలకు కాలువేయబోయేటంతలో, భట్టుమూర్తికి వీధిలో ఎవరో కనబడతారు. రమ్మంటు వాళ్ళను కేకవేస్తాడు. వాళ్ళతో తన రోరింగ్ ప్రాక్టీస్ గురించి కబుర్లు మొదలుపెడతాడు.

''చచ్చిపోతున్నానయ్యా బాబూ ! లోపల గదులన్నీ ఇవ్వాళే ఖాళీ అయ్యాయి. ఇంకా ఓ పేషెంటు వుండనేవున్నాడు డిస్‌ఛార్జి చేస్తానన్నా వెళ్ళనంటాడు. ''డాక్టరుగారూ ! పూర్తిగా నయమయ్యేదాకా ఇక్కడే వుండనీండి నన్ను !'' అంటూ ఒకటే రిక్వెస్టు ''కాదయ్యా బాబూ, అవతల క్యూలో నుంచున్నారు పేషెంట్లు ! వాళ్ళకు గదులు కావాలీ, ఖాళీచేసేయ్ ! నీ ప్రాణానికే ఏం ముప్పులేదూ !'' అన్నా వినడే !!''

ఈ మాటలు విని విని, అవతల మనిషి ''వస్తానండీ !'' అంటూ వెళ్ళిపోబోయాడు

''పాత బాకీ ఏదో వున్నట్టుందీ ?'' అనబోయాడు డాక్టరుగారు

''ఈసారి వచ్చినప్పుడు తెండి !'' అతను విసురుగా వెళ్ళిపోయాడు.

అతను అటు వెళ్ళీవెళ్ళగానే ఇటు రాజ్యం వరండామీదకు దూకుడుగా వచ్చింది. ''అవతల ఆ పెద్దమనిషి పడుకుని అంతా వింటూనేవున్నాడు. ఎందుకా అబద్ధాలూ ?'' అన్నది విసుగ్గా.

డాక్టరు భట్టుమూర్తి తన భార్యవేపు ఆశ్చర్యంగా చూశాడు. ''ఈ అబద్ధాలే లేకపోతే, ఇక్కడికి వచ్చే ఆ ఒహళ్ళిద్దరు కూడా రారు రాజ్యం !! ఇదంతా ఎడ్వర్‌టైజ్‌మెంట్ల యుగం!! అబద్ధాల యుగం !! మసిబూసి మారేడుకాయ చేస్తేనే బ్రతకగలం ! నాకు ఇంకా ఆ విద్య సరిగా వంటపట్టకనే ఈ తిప్పలు !! కడుపు నిండినవాడినే అందరూ విందుకు పిలుస్తారు అట్లాగే రోరింగ్ ప్రాక్టీసు వున్నవాడి దగ్గరకే అందరూ వెళతారు గోళ్ళు గిల్లుకుంటూ కూచునేవాడి దగ్గర కెవరూ రారు. కూచుని కూచుని వాలాంటివాడికి విసుగెత్తి పోతుంది. నేర్చుకున్నది మర్చిపోవడం అవుతుంది. జీవితంమీద విరక్తి పుడుతుంది అట్లా జరక్కుండా వుండటానికేనే రాజ్యం ! — నన్ను నేను మోసపుచ్చు కుంటూ, జనాన్ని ఆకర్షించటానికి ప్రయత్నం చేస్తున్నాను. చెప్పు. ఇది తప్పంటావా ?''

''తప్పంటావా ?'' అన్న మాటను ఆయన గొంతు స్పష్టంగా పలకలేకపోయింది. ఆయన ప్రశ్నకు ఆయన భార్య సమాధానం చెప్పలేక పోయింది ''మీరూ, మీ వ్యాఖ్యానాలూ నాకెప్పుడు అర్థమైనాయి గనుక !'' అనుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

ఆయన పలుకులు విన్నతర్వాత, ఆయనమీద అంతవరకూ నాకు వున్న తక్కువ భావం తగ్గిపో యింది. జీవన పద్మవ్యూహంలో చిక్కుకుని బ్రతుకు తెరువు కోసం పోట్లాడుతున్న అభిమన్యుడుగా ఆయన నాకు కనిపించాడు.

ఆయనను దగ్గరకు పిలిచి నా గౌరవాన్ని ప్రకటిద్దామనుకునేటంతలో, గోలుగోలున ఏడుస్తూ ఆయన ఇంటిముందు ఓ కుటుంబం రిక్షాలోనుండి దిగింది. కళ్ళు అరమూతలుగా మూసుకుపోతున్న ఓ పదేళ్ళ కుర్రవాణ్ని చేతుల్లో మోసుకుంటూ ఓ మధ్యవయసు తండ్రి వరండాలోకి వచ్చాడు ఆయన వెనకనే ఆయన భార్య ఓ మధ్యతరగతి ఇల్లాలు కళ్ళనీళ్ళలో, స్పష్టంగా వివిపించని పదజాలం పలుకుతూ, అక్కడికి వచ్చింది.

పిల్లవాడి తండ్రి జేబులోనుండి ఓ వంద రూపాయల నోటు తీసి అక్కడ పెట్టాడు. రెండు చేతులూ జోడించాడు ''డాక్టరుగారూ ! ప్రొద్దుటి నుంచీ మా కుర్రవాడు మన లోకంలో లేడు మన చూపు కాదు, మన వాలకం కాదు ఎట్లా అయినా కాపాడండి ఎంతైనా తీసుకోండి మా కుర్రవాణ్ని మాకు దక్కించండి !'' ఆ మధ్యతరగతి ఇల్లాలు అంటున్నది — ''అటు మూడు తరాలకూ ఇటు మూడు తరాలకూ మాకు వీడొక్కడే డాక్టరుగారూ! ఎంత ఫీజయినా పర్వాలేదు నా చేతిన గాజులున్నాయి మెళ్ళో గొలుసుంది ఎంత మంచి మందు వేయ డానికి వీలుంటే అంత మంచి మందు వేయండి నా బాబును నాకు ఇవ్వండి !''

డాక్టర్ భట్టుమూర్తి ఆ కుర్రవాణ్ని పరీక్షించాడు. గుండె, నాడి, నాలుక, కళ్ళు అన్నీ చూశాడు. ఎదురుగా స్టూలుమీద వుంచిన వంద రూపాయలు నోటుకేసి ఒకసారీ, ఆ పిల్లవాడి తల్లికేసీ ఒకసారీ చూచాడు.

''ఏవండీ ! మీ అబ్బాయిని తక్షణం మీరు ఆస్పత్రిలో చేర్పించండి. ఆపరేషన్ ఇమ్మీడియెట్‌గా చేయించాలి. తీసుకుపొండమ్మా తీసుకుపోండి! తక్షణం తీసుకుపొండి. మీ డబ్బులు నాకొద్దు. మీ నగలు నాకొద్దు. మీ అబ్బాయి బ్రతకడం నాకు కావాలి. మీ అబ్బాయిని నేను బ్రతికించలేను. నా శక్తి అందుకు చాలదు. నా ప్రాక్టీసు అంత లేదు నా దగ్గర మందు లందుకు లేవు వెళ్ళండమ్మా వెళ్ళండి ! ఆలస్యం చేయకండి. రిక్షాలో కాదు, ఆటోలో తీసుకుపోండి !''

వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిం తర్వాత ఆయన భార్య లోపల్నుంచి వచ్చింది.

''నిజం చెప్పి తప్పు చేశానంటావా రాజ్యం ?'' అని అడిగాడాయన. ''అబద్ధం చెప్పి ఆ డబ్బు తీసుకుంటే, ఆ కుర్రవాణ్ని ఇక్కడే అట్టిపెట్టేస్తే, అతగాడు బ్రతకడు రాజ్యం! అది మహాపాపంకాదూ!''

ఆయన భార్య ఆయనవేపు నిశ్చలంగా చూసింది. ''తప్పేం లేదండీ ! మీరు మంచిపనే చేశారు. ఆ కుర్రవాడు బ్రతికితే ఆ పుణ్యం చాలదూ?'' అంటూ లోపలకు వెళ్ళిపోయింది. నేను మెల్లగాలేచి ఆయన దగ్గరకు నడిచివచ్చి, నా దగ్గరవున్న డబ్బును ఆయన చేతిలోపెట్టి ఆయన గుప్పిట మూశాను. ''మీ ప్రాక్టీస్ గురించి నేను చెప్తానందరికీ !! ఇందుకు నేనే ప్రత్యక్ష సాక్షిని !!'' అన్నాను. ఆ మాటలంటున్నప్పుడు నాకు నాకే ఎంతో తృప్తి అనిపించింది. ఒక మంచిపని చెయ్యబోతున్నానన్న తృప్తి అది !! ఇహనుండి ఆ దారంటనే నేను వెళతాను రహదారి వుండగా చుట్టుదారి ఎందుకూ ?

★